# ప్రతిధ్వని

బొడ్డు బాపిరాజుగారు

మానవుని చితిమండుచున్నది; ఆరుచున్నది. కాని హృదయజ్వాల, ద్వేషానలము పుట్టినమొదలు వృద్ధిపొందుచునేయుండును.

తార విధవరాలైన నాడు బంధువులందఱును విచారించుచున్నారు. అన్నగారి మరణమున కేడ్చుచు ఎత్తిపొడుపుగా "ఒదినా! ఎవరి పాపమెవరనుభవింతురు?" అన్న మఱది మాటలు ఏడ్పులసందడిలో చెవులు నిక్కబెట్టి ఆసన్నవైధవ్యమున వసయుచున్న తార విన్నది.

తార ధనికురాలు. వైధవ్య మీకారణమున దూరమునందుండియే భయపడిపోవుచున్నది. దాని పూర్ణానుభవము తారకెన్నడును రుచిచూపలేదు. పాపము! మఱది రాముడు తనతనయ శ్యామతో ఎట్లో కష్టదినములు గడుపుచున్నాడు. వరశుల్కము లభింపదను నిరాశవలన పెండ్లిచేసుకొనుట కెవ్వరు నాయత్తపడలేదు. శ్యామకు పదునాలుగేండ్లు దాటినవి. ఎంత ప్రయత్నించినను రాముడామెకు పెండ్లిచేయలేకపోయెను. తుదకు కాలము చేసెను.

శ్యామ నిస్సహాయ; ఏకాకి అయినది. జీవితమంతయు ఖైదులోనున్నట్లు గడుపుచున్నదామె ఒంటరిగా. గంగానదిఒడ్డునఉన్న తమతోటలోనిపూరిగుడిసెలో కాపురమున్నది.

రాత్రులందు తోడుగా నొకవృద్ధురాలామెవద్ద పరుండును. పేరు 'మన్నీ'. శ్యామ ఆమెను 'దాదీ'అని పిలుచును. ఎచ్చటనుండి ఏవిధముగా తెచ్చి తన యన్నపానములకు లోటులేకుండ చేయుచున్నదో వృద్ధురాలెఱుగదు. నెమ్మది నెమ్మదిగా దారిద్ర్యమునకు మిగిలిన చిహ్నములన్నియు విక్రయింపబడి శ్యామగర్భగోళములో ప్రవేశించినవి.

ప్రస్తుతము మామిడితోట వేలంఅగుటకు సిద్ధముగానున్నది.

* *

గంగానదిశీతలశరీరమును కదుష్ణముచేయుటకు బాలాతపము ఇంకను అసమర్థమైయున్నను నవకిసలయములను తళుకు లీనించినది. వసంతుని శుభాగమనముహూర్తమున కోకిలగాయకుని 'కుహూ' మంగళరావములు చెలరేగినవి. మామిడిపిందెల గుత్తులు తలలూపినవి. ఆమ్రవనమున వసంతఋతులక్ష్మి; శ్యామ కోమలశరీరమున యౌవనలక్ష్మి తాండవించినది.

శ్యామ ద్వారమువద్ద నిలువబడి సోపానములదిగువ సంవత్సరాదిపర్వమునకు స్నానము చేయుచున్నవారిని జూచుచున్నది. సమీపించినకొలది మెల్లెక్కుచు జనసమూహము స్పష్టముగా కన్పడుచున్నది.

మన్నీ వచ్చుచునే చేయిపట్టుకొని—"పదవమ్మా? మనముకూడ స్నానముజేసి వద్దాము." అన్నది.

"రాను, దాదీ! జ్వరమువచ్చునట్లుగా నేను శరీరము బ్రద్దలగుచున్నది." అన్నది శ్యామ.

మన్నీ నిర్గమించినది.

తార స్నానముజేసి దాసితోగూడ మెట్లపై కెక్కినది. శ్యామతోటప్రక్కనుండియే పోవలసినమార్గము. అచ్చట ఎవ్వరును లేకుంటుటచూచి సంతుష్టితో ఊపిరితీసినది తార. మావిపిందెలతో వ్రేలాడుచున్నకొమ్మకు నామెశిరస్సు తగులుకొన్నది. కొమ్మ త్రోవ మీదికి వంగియున్నది. తార చూచినది, ఎవ్వరునులేరు. చేయెత్తి కొన్నిపిందెలను కోసుకొన్నది. "పిన్నీ! ఇంకాకోసుకో. రేపటి కిదివేలం అయిపోతది" అన్నారు వెంటనే ఎవ్వరో.

అగ్నిబాణములవంటి తారనేత్రములు ఎవరినో దహించివేయుటకు తెరచుకొన్నవి. తిరిగి ఆమెహృదయమున చాలరోజులనాటి యామాట ప్రతిధ్వనించినది. "ఎవరి పాపము ఎవరనుభవింతురు." తార జలదరించినది. రామునికూతు రెత్తిపొడిచినట్లామెగ్రహించినది. పెదవి నొక్కుకొనుచు వెళ్లిపోయినది.

* * *

నూటైదు—ఒకటోసారి.

నూటైదు—రెండోసారి.

నూటైదురూపాయలు—మూడోసారి.

చెప్పటం అయినది. "నాలుగోవంతు రూపాయలు ఎవరు జమకట్టుతారు?" అన్నాడు అమీనా.

"నాల్గోవంతుకాదు. పూరాగా తీసుకోండి. తారపేరరశీదువ్రాయండి" అన్నాడు బలిష్టుడగు యువకుడొకడు. రూపాయిలుదగ్గర పెట్టబడినవి. రశీదు యివ్వబడినది. శ్యామ నిశ్శబ్దముగా మావిచెట్టుక్రింద కూర్చున్నది. ఆమెకేమియు వినబడుటలేదు. డప్పు సవ్వడితో కేవలము "ఒకటి, రెండు, మూడు"యొక్క ప్రతిధ్వనిమాత్రమే చెవులలో మ్రోగుచున్నది. "పద, మంచిపనైంది. తార అనాధబాలికాశరణాలయము కట్టించియుంచినది. నూటైదుకు కొన్న మూడెకరాలతోట; గంగబడ్డునఉన్న ఇల్లుకాదు" అన్నాడొక పెద్దమనిషి.

"శరణాలయ మెక్కడున్నదో భగవంతునికెరుక?" అన్నది వృద్ధురాలుమన్నీ. శ్యామ నిశ్శబ్దముగా వినుచున్నది. సంజప్రొద్దు వ్రాలినది. ఆతోటలో కాపురమున్న పక్షివర్గములు కలరవములతో గూండ్లకు మరలినవి. కాని శ్యామకదలలేదు. తనకుకూడ ఇల్లున్నవిషయ మామె మఱచిపోయినది.

* * *

ముసలిదానితోకూడ అమీనాసాహేబువచ్చి నిలవబడినాడు. అమీనా యొక సుందరుడని చెప్పదగిన యువకుడు. ఏ స్త్రీయైనను తప్పక తన్నొకసారి తలయెత్తిచూచి తీరునని యతని సహజవిశ్వాసము. దారిద్రము శ్యామసౌందర్యమును అడ్డగించెను కాని యౌవనమును దాపలేకపోయెను. కుమారయౌవనము క్రీడావిహ్వలమైయుండెను.—"మన్నీ! అడుగుము. నేను రూపాయలిచ్చెదను. ఇంకను ఒకనెల గడువున్నది. రూపాయ లివ్వటంవలన ఏలం ఆగిపోతుంది"అన్నాడు అమీనా. శ్యామ అతని వైపొకసారి తీవ్రముగా చూచినది. విగ్రహపుష్టిగల యమీనా ఆయనాథబాలికాదృష్టి సహింపలేక నెమ్మదిగా జారినాడు. వర్షాంభస్సిక్తమగుకాష్ఠ మామెనయనములలో జ్వలించుట మన్నీచూచినది. అచ్చటనుండి ఇంటికివెళ్ళమని చెప్పుటకు ఆమెకు సాహసము జాలకపోయెను. కొంచెముసేపుండి ఆమెయే వచ్చును లేకున్న అప్పుడే వెంట పెట్టుకొని తీసుకొని వెళ్లవచ్చునని మన్నీ తలపోసినది. తిరిగి ఆమెవచ్చినప్పుడు నిశీథాంధతమసమున నెంత యన్వేషించినను శ్యామకన్పట్టలేదు.

* * *

తారకు ఉత్తరాధికారిగా వచ్చినవాడు ఆమె సహోదరపుత్రుడు ప్రకాశము. ఆకస్మికముగా నైశ్వర్యమబ్బుటచే తరుచు ఎట్లుగా తయారగుదురో అట్లేఅయి ప్రకాశము తనలో తాను నిలువజాలకపోయెను. అత డాపల్లెటూరును మొదటితరగతి బస్తీగాజేసి కూర్చున్నాడు. పూర్వము తారయున్న యింటివద్దనుండి శ్యామతోటవరకు క్రోసెడు దూరము బాగుగా తయారుగావించెను. ప్రాతకొంపపీకించి బంగాళానిర్మించెను. ఉద్యానవనములో పంథలు; లతాతోరణములు వెలసినవి. ఇదియే ప్రకాశబాబు కూర్చుండుతావు; నౌకరు లిందుచే దీనిని 'ఛావనీ' అందురు.

ఆషాఢమాసము. ఉదయమునుండియు చాల ఉబ్బగానున్నది. తూర్పుగాలివలన మేఘమండలము స్థిరత్వముదాల్చినది. వర్షముకురియు సూచనలు ద్యోతకమగుచున్నవి. పక్షివర్గములు అస్తవ్యస్తముగా సంచరించుచున్నవి. పిచ్చిదొకతె గంగాతటమునుండి పైకెక్కుచుండెను. తనపాదవిన్యాసములను ఒకటి-రెండు-మూడు అని అస్పష్టస్వరముగ గొణుగుచు ఆకాశమువంక చూచుచుండెను. తోటతలుపులు తెరచియుండుటచే లోనప్రవేశించినది. మామిడిచెట్లక్రింద తిరుగుచు ఒకటి-రెండు-మూడు-అని లెక్కపెట్టుచుండెను.

తరంగమువలె ఒకగాలివిసరు విసిరినది. ఏటవాలుగా నొకతుంపరజల్లుపడినది. నాలుగైదు మావిపిందెలు రాలినవి. పిచ్చిది కంగారుపడినది. మూటికంటె నెక్కుడు లెక్కపెట్టుట ఆమె ఎఱుగదు. ఇటు తుంపరులలెక్క, అటుమామిళ్ళు. చాలాగడిబిడి అయినది. ఒకమబ్బుతునక వర్షించుచు బయలుదేరినది. పిచ్చిది ఒక్కసారిగా స్వస్థురాలైనది.

మయూరమొకశాఖపై గూర్చుండి షడ్జము నాలపించుచున్నది. ఆస్వరము పిచ్చిదానికి ఎఱుకఉన్నట్లు గుర్తువచ్చినది. తిరిగి లెక్క-మొదలు-ఒకటి-రెండు-మూడు-ముగిసిన పిదప కొమ్మవైపుచూచినది. ముఖము వికసించినది. మరల-ఒకటి-రెండు-మూడు-ఈతేప లెక్కలో మిక్కిలి ఉల్లాసము; విస్మయము; హర్షము నుప్పిరిగొన్నవి. ఒకగుత్తికే పండియున్న మూడుమామిడిపండ్లను వృంతముతోకూడ త్రుంచినది. అవి ఊపుచు లెక్కసాగించినది. గిలకపంతుతో ఆడుకొనుపసిపాపవలె పిచ్చిదానితో ఆడుకొనుచున్నది.

తోటమాలి వచ్చినాడు. తిట్టినాడు. కొట్టుటకు చేయికూడఎత్తినాడు. ఉన్మాదిని తనయాటచాలించి నిశ్శబ్దముగా అతనివేపు నిర్నిమేషనయనములతో వీక్షించినది. అతడామెచెయ్యిపట్టుకొని ప్రకాశబాబువద్దకు తీసుకొనివెళ్లినాడు.

ప్రకాశము యక్ష్మరోగపీడితుడై ప్రస్తుతము నిరంతరిమిచ్చటనే యుండువాడు. తలగడదిండ్ల సహాయమునకూర్చుండి 'పీకదానా'లో కఫరక్తముల నుమియుచుండువాడు. శల్యావశిష్టమగు శరీరమంతయు కృశీభూతమైనది. ముఖబింబమున దీర్ఘనాశిక, విశాలనేత్రములు తామున్నట్లు మొరపెట్టుకొని నిరూపించుకొనుచుండెను. పిచ్చిదానినిపట్టుకొని మాలీఅతనివద్దకు వచ్చెను.

విలాసుడగు ప్రకాశముచూచినాడు. పిచ్చిదానియావనసుగంధమింకను ఆమెను అనుసరించుచునేయుండెను. కాముకుడగు ప్రకాశమునకు నేడాతనిరోగముపై క్రోధమువచ్చినది. వచ్చుటలో పూర్ణముగావచ్చినది. అతడాకోపమునణచుకొని పిచ్చిదానివైపు సాగినాడు. తోటమాలి బండబూతుల జంఝామారుతము ఆమెనెదురుకొన్నట్లు చేతిలోని మామిడిపండ్లుచూచి గ్రహించినాడు.

పిచ్చిది "ఇదిఎవరి పాపఫలము? నీవెఱుగుదువా? దీని నెవ్వ రనుభవింతురు? చెప్పు-ఒకటి-రెండు-మూడు" అన్నది.

"దొంగతనమును పిచ్చితనముతో కప్పిపుచ్చుటకు చూచుచున్నావు. నీవుకోరినవి కావలసినన్ని దొరుకును. దొంగతనముచేయనేల?" అన్నాడు.

ఒక్కసారిగా పిచ్చిదానిప్రలాపము రక్తాంబరముధరించి నయనగోళములలో తాండవించినది. మామిడిపండ్లగుత్తితో క్షయజర్జరమగు ప్రకాశునిహృదయముపై బలముకొలదికొట్టుచు లెక్కపెట్టినది-ఒకటి-రెండు-మూడు-ప్రకాశము తలగడదిండ్లపై బడి సంశయముతో నూరుకున్నాడు. పిచ్చిదినవ్వుచు అక్షయగణనము సాగించినది.-ఒకటి-రెండు-మూడు-దానిప్రతిధ్వని తోటలో ముఖరితమైనది. —అనువాదము.